క్లుప్తంగా

ఘనంగా ధనుర్మాస పూజలు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. స్వామివారికి తిరుప్పావై, మంత్ర పుష్పం ప్రత్యేక భజనలు కొనసాగాయి. మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

ధ్రువపత్రాలు లేని వాహనాలు పట్టివేత

ఉప్పునుంతల: శాంతి భద్రతల పరిరక్షణ, నేర నివారణ చర్యలలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఆదివారం ఉదయం మండల కేంద్రంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువ పత్రాలులేని ఎనిమిది ట్రాక్టర్లు, ఆరు ఆటోలు, 15 బైక్‌లు పట్టుబడినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. దీంతోపాటు ఇద్దరు డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన వాహనాలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జరిమానాతో పాటు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి భూమిపూజ

చారకొండ: మండలంలోని జేపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి రూ. 5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. నాయకులు పవన్‌నాయక్, లక్ష్మయ్య, సీతారాములు, చిన్న వెంకటయ్య, పార్వతమ్మ, రాములమ్మ, వెంకటేష్, శ్రీనివాస రావు, రమేష్, నరేందర్ గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత



పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల గ్రామానికి చెందిన బంటుపల్లి భగవంతు ఇటీవల మృతిచెందాడు. శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ చేయడంతో ఆదివారం మృతుడి కుటుంబానికి రూ.3.60 లక్షల జీవితబీమా చెక్కును అందజేశారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్ మహ్మద్ ఉస్సేన్, సబ్ ఏజెంట్ శ్రీనివాసులు, మాజీ సర్పంచులు దొండ శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, ఖలీల్, రామచందర్, రాజారెడ్డి, మెరుగు రాజు, శ్రీహరి, రాజుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

పెద్దకొత్తపల్లి: ఏకల్ గ్రామ మొత్తస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాల 500 మంది విద్యార్థులకు ఆదివారం కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లను ఏకల్ మొత్తమ్ ఆర్గనైజర్ పాండురంగారెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో ఏకల్ ఆన్ వీల్ బస్సులో 15 ల్యాప్‌టాప్‌లు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 మండలాల్లో ప్రతి రోజు 20 గ్రామాల్లో 35 బ్యాచులు తయారు చేసి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐవీడీ కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్, బాల్‌రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల తనిఖీ



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పలు రైస్‌మిల్లులను ఆదివారం తహసీల్దార్ ఇబ్రహీం తనిఖీ చేశారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని వెంటనే అప్పజెప్పాలని కోరారు. ఇప్పటి వరకు మిల్లులకు వచ్చిన ధాన్యానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గడువులోగా బియ్యం సమర్పించని వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇబ్రహీం హెచ్చరించారు.

రేపు బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన



నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై బీఎస్పీ ఆధ్వర్యంలో 24న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్‌లు తెలిపారు. ఆదివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలకపల్లి మండల అధ్యక్షుడు హర్ష, బాలనాగులు, ఖాసీం పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



వెల్దండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్/వెల్దండ: అన్ని వర్గాల అభ్యున్నతి ప్రభుత్వం కృషి చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వం తరఫున కల్వకుర్తిలో క్రిస్మస్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. అదే విధంగా వెల్దండ ఎంబీ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రైస్తవులకు అండగా ఉందని, ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

■ కల్వకుర్తి పట్టణంలో చిరువ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన మార్నింగ్ వాక్ చేస్తూ.. చిరువ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు. ఓ హోటల్‌లో దోశ వేశారు. మటన్ షాప్ వద్దకు వెళ్లి మటన్ కొట్టారు. అనంతరం ఎల్లికల్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో పాల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, తహసీల్దార్ ఇబ్రహీం, కౌన్సిలర్ ఎజాస్, మసూద్, రమాకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాస్టర్ ప్రసాద్, మాజీ సర్పంచులు భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్, నాయకులు సంజీవ్‌కుమార్, వెంకటయ్యగౌడ్, రషీద్, ఎర్ర శ్రీను, పుల్లయ్య, తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

■ వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటిక ప్రమోద్‌కుమార్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.13000 వేలు మంజూరయ్యాయి. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ విజయ్ కుమార్‌రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్లు కృష్ణ, రాజశేఖర్, నాయకులు అనిల్‌కుమార్, ఆంజనేయులు, విజయ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

కొల్లాపూర్: బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ బిజ్జ దేవదాసు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. కో కన్వీనర్లు బండి శ్రీను, బిజ్జ వేణు, గోవు రాజు, డి.శేఖర్, అవుట స్వామి, కర్నె శివయ్య, బిగులు రవి, కురుమయ్య, చిన్నకురుమయ్య, బీకే. మూర్తి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బల్మూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్‌షాను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కావన్నయాదవ్, నర్సింగ్‌రావు, శ్రీనువాసులు, మశన్న తదితరులు ఉన్నారు.

లింగాల: బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తార్, శివ, వెంకటయ్య, శ్రీశైలం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చారకొండ: బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ ఖండించారు. వారి వెంట నాయకులు గణేష్ గౌడ్, అంజయ్య, లక్ష్మణ్ ఉన్నారు.

కోమటికుంట హెచ్‌ఎంకు జాతీయ పురస్కారం



లింగాల: మండలంలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల వటవర్లపల్లికి బదిలీపై వెళ్లిన ఆంగోత్ అంజిలాల్‌కు నంది అవార్డు దక్కింది. జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ బంగారు నంది అవార్డును కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి చేయూత, మండలంలో చెంచు పెంటలలో చెంచులకు అనేక రకాలు సేవలను గుర్తింపుగా అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసులు, సభ్యులు సుధాకర్, వేదవ్యాస్, వెంకటేష్, సంఖ్యాక శాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, సీనియాక్టర్లు మాణిక్, సృజన, నాగ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెల్దండ: బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి మండలం యంగంపల్లి గ్రామానికి చెందిన రవి హైదరాబాదు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యలో కొట్రగేట్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంతో తలకు గాయంకావడంతో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

ముళ్లపొదల తొలగింపు

కొల్లాపూర్: పట్టణంలోని 5వ వార్డులో ముస్లిం శ్మశానవాటికలోని ముళ్లపొదలను ఆదివారం స్థానిక యువకులు స్వంత డబ్బులతో తొలగించారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో యువకులు చందాలు వేసుకొని ముళ్లపొదలు తొలగించినట్లు యువకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శ్మశానవాటికకు వెళ్లే రోడ్డును సీసీగా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో దర్వేష్, సోఫీ, జాకీర్, పాషా, నిరంజన్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల నూతన కమిటీ ఎన్నిక



బిజినేపల్లి: మండలంలోని వట్టెం జవహార్ నవోదయ విద్యాలయంలో పాఠశాల పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీహరియాదవ్, శివశంకర్‌తో పాటు కమిటీలో ఆయా విభాగాల్లో భరతసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుబ్బరాయుడు, వై.కార్తీక్, ప్రణీత, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, అఖిలలు ఎన్నికయ్యారు. విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

క్లాస్‌మేట్ నూతన కార్యవర్గం ఎన్నిక



కందనూలు: క్లాస్‌మేట్ నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఎన్నుకున్నారు. పరిశీలకుడిగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కేపీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సి రమణ, కోశాధికారిగా గాడి సురేందర్ ఎన్నికయ్యారు. సామాజిక అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేంద్ర కోరారు. కార్యక్రమంలో సభ్యులు చంద్రమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన దశరథం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆదివారం సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు బాధితుడిని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ రషీద్, తిరుపతిరెడ్డి, పురుషోత్తం, రామస్వామి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో కళాకారుడు మృతి

తెలకపల్లి: భజన కళాకారుడు, క్రీడాకారుడు అతి నారపు శ్రీనివాసులు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు మృతిపై పలువురు కళాకారులు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్యతో పాటు పలువురు నివాళులర్పించారు. భజన కీర్తనలతో అందరిని ఆకట్టుకునేవాడని పలువురు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మర్రికి పరామర్శ



తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. తిమ్మాజిపేట నేరేళ్లపల్లిలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆదివారం జంగిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. మర్రి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శించారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆదివారం సెలవు రోజు అయినప్పటికి పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఎంపీడీఓ బ్రహ్మాచారి, పంచాయతీ కార్యదర్శులు పవన్‌కుమార్, శుభాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి సర్వే నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సర్వే చేపట్టారు.

25న వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా గ్రామంలో విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ మట్ట శారదమ్మ తెలిపారు. ఆదివారం విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. అధిక సంఖ్యలో అభిమానులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదివిధంగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ చైర్మన్ మట్ట మదన్‌గౌడు, క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డిలు తెలిపారు.

విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పిలుపు మేరకు ఫిబ్రవరి 3న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకుడు రాష్ట్ర కార్యదర్శి గూట విజయ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 మండలాల నుండి డప్పు కళాకారులు హాజరుకావాలని కోరారు. అనంతరం డప్పు కళాకారుల కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా బొప్పల్లి సుల్తాన్, కార్యదర్శిగా కోడుపర్తి విజయ్, కోశాధికారిగా రాము, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, భీముడు, జగన్, శ్రావణ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా ఉస్సేన్, గిద్ద రామస్వామి, శివకుమార్, రామకృష్ణ, బాలనాగయ్య, నిరంజన్, సహాయ కార్యదర్శులుగా బాలస్వామి, మల్లేష్, గడ్డం యాదగిరి, రాము తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో దండోరా జాతీయ కళామండలి నాయకుడు అశోక్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డప్పు స్వామి, నాయకులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



అభిషేకం చేస్తున్న స్వాములు

చారకొండ: మండలంలోని జూపల్లిలో అయ్యప్ప మాలధారులు ఇరుముడి మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి యాదయ్య ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని శబరి మలై యాత్రకు బయలు దేరారు. గ్రామంలో బంధువులతో పండుగ వాతావరణం నెలకొంది. మాజీ వైస్ ఎంపీపీ బక్కమ్మ స్వాములకు, భక్తులకు అన్న ప్రసాదం చేశారు. వెంకటయ్య యాదవ్, రామచంద్రి, ప్రవీణ్, గణేష్, కొండలయ్య, రమేష్, లక్ష్మణ్, రమేష్, శివ, జానకి రామ్ తదితర మహిళలు గ్రామస్తులు ఉన్నారు.

పీవీ రావు, కాకా సేవలు మరిచిపోలేం



మన్ననూరులో నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

అచ్చంపేట/పెంట్లవెల్లి: మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీరావు 19వ వర్ధంతిని అచ్చంపేట, పెంట్లవెల్లి మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మాల మహానాడు రాష్ట్ర నాయకులు గోవురాజు, అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు కె.అంజనేయులు, వేటూరి వెంకటయ్య, రామకృష్ణ, చెన్నకేశవులు, రవి, కుంద మల్లికార్జున్, కె.బాలస్వామి, రవిందర్, జనార్దన్, పవన్ పాల్గొన్నారు.

మన్ననూర్: మాలల అభివృద్ధికి పీవీరావు, కాకా(గడ్డం వెంకటస్వామి)లు చేసిన సేవలను మరిచిపోలేమని మాల మహానాడు నాయకులు పదెద మద్దెల శేఖర్, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మన్ననూర్‌లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మాలలు ఆలయం ఎదుట వారి చిత్ర పటాలకు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘునాథం, శ్రీనివాసులు, సాయిలు, జగదీష్, అనంతరాములు, దేవేందర్, పురుషోత్తం, బాలస్వామి, బాల్‌నారాయణ, మధు, బుచ్చయ్య, యశ్వంత్, కృష్ణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఈగలపెంట శక్తిసదన్‌లో..

దోమలపెంట: కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి వర్ధంతి పురస్కరించుకుని ఈగలపెంటలోని శక్తి సదన్‌లో ఆయన చిత్ర పటానికి భూగర్భ కేంద్రం ఎస్‌ఈ(ఓఅండ్‌ఎం)ఆదినారాయణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈఈ రమేష్, డీఈ ఉమామహేశ్వరాచారి, ఇంజినీర్లు రామకృష్ణ, అక్తర్, ఏఎం(హెచ్‌ఆర్)కిరణ్‌రాయి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పీవీ రావు, గడ్డం వెంకటస్వామి వర్ధంతిలను నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సామ మహేష్, కూన నిరంజన్, శ్రీనివాస్, వెంకటయ్య, ఆంజనేయులు, రాంచందర్, అశోక్, చంటి, చెన్నయ్యలు ఉన్నారు.

కరపత్రాల విడుదల

నాగర్‌కర్నూల్‌రూరల్: తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం చలో భీం కోరేగావ్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దెల చంటి మాట్లాడుతూ జనవరి 1న నిర్వహించే భీం కోరేగావ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహా యుద్ధవీరుల వీరోచిత పోరాటానికి చిహ్నంగా ఉన్న స్తూపం దగ్గర నివాళులర్పిస్తామన్నారు. మాల మహానాడు నాయకులు తగిలి వెంకటస్వామి, బండి శ్రీను, జట్టి చంద్రయ్య, రమేష్, అవుట శ్రీను, పెరుమాళ్ల యాదయ్య, జెట్టి మహేష్ పాల్గొన్నారు.

అన్ని మతాల సారం ఒక్కటే



వెల్దండ: అన్ని మతాల సారం ఒక్కటేనని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బైరాపూర్ సైదులు దర్గాకు రూ. 2.50లక్షల విలువతో రేకుల షెడ్ నిర్మాణం చేపట్టారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ధర్మకర్త జంగమ్మ, మీనయ్య, సైదులు, సర్వేశ్, సైదులు, నాగేష్, గ్రామస్తులు రామచంద్రయ్య, చెన్నయ్య, వెంకటేష్, జంగయ్య, జగన్, సత్యనారి, పాండు, వెంకటయ్య, ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్, లాలు నాయక్, మాజీ సర్పంచ్ లాలు, లక్ష్మణ్, మహేష్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



తాడూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ కోరారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు యాదిరెడ్డిపల్లి, అంతారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బహుజనులను, పేదలకు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఇళ్ల స్థలాల విషయంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సభలలో అందరి సమక్షంలో అర్హులైనవారిని ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు శివ, రాములు, అనూష, అంకిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర ప్రభోత్సవ కమిటీ ఏకగ్రీవం



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో ఉమామహేశ్వర ప్రభోత్సవ కమిటీని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచన మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సమక్షంలో అధ్యక్షుడిగా బొద్దుపల్లి శివ ప్రసాద్‌తో పాటూ మరో 5 మంది ఉత్సవ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, శ్రీనివాసులు, రవి, శంకరయ్య, సెవ్వ బాలు, గెలువయ్య, ప్రసాద్, తుల్చ, రామకృష్ణ, ఈదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం



తుమ్మెన్‌పేట రావులకుంట వెనక ఉన్న చెరువు



చెరువులో వేసేందుకు తీసుకొచ్చిన కోళ్ల వ్యర్థాలు

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట గ్రామ శివారులోని రావులకుంట వెనక భాగంలో గ్రామానికి చెందిన ఐదుమంది రైతులు చేపల చెరువును ఏర్పాటు చేశారు. చేపలను పెంచేందుకు లీజ్‌కు ఇచ్చారు. కాని లీజ్‌కు తీసుకున్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన రామకృష్ణ చేపల పెంపకం కోసం నిత్యం పట్టణంలోని చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను సేకరించి చెరువుల్లో వేస్తున్నారు. దీంతో దుర్గంధ వాసన వెదజల్లుతోంది. కుక్కల బెడద కూడా అధికం అయ్యిందని గ్రామస్తులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం చేపల పెంపకం కోసం ప్రత్యేకంగా దాణా ఉపయోగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. వ్యర్థాలను వాడుతూ చేపలను పెంచి ఇక్కడి నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాడని గ్రామస్తులు మండిపడుతున్నారు. చేపల పెంపకందారుడు ఇష్టానుసారంగా కోళ్ల వ్యర్థాలతో పాటు వివిధ రకాల కుళ్లిపోయిన మాంసం వ్యర్థాలను వాడుతున్నా అధికారులు ఏమాత్రం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మత్స్యశాఖ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

తుమ్మెన్‌పేట వద్ద చేపల పెంపకం చెరువును పరిశీలిస్తాం. ఇప్పటివరకు ఫిర్యాదులు రాలేదు. ఎఫ్‌డీఓతో సమాచారం సేకరించి ఘటన స్థలానికి వెళ్తాం. నిబంధనల ప్రకారం పెంపకందారుడిపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రజని, ఏడీ, నాగర్‌కర్నూల్